నమస్తే తెలంగాణ

# జిందగీ

13

హైదరాబాద్ ఆదివారం 9 జూన్ 2024
www.ntnews.com

## ష్... కిడ్నాప్

### పారిజాత పర్వం




**ఆహా:** జూన్ 12
**తారాగణం:** చైతన్య రావు, శ్రద్ధాదాస్, సునీల్, వైవా హర్ష తదితరులు
**దర్శకత్వం:** సంతోష్ కంభంపాటి

కామెడీ యాక్షన్ చిత్రాలకు ప్రేక్షకుల ఆదరణ ఎప్పటికీ ఉంటుంది. కథలో కీలకమైన మలుపులు లేకపోయినా... హాస్యం పండితే ఈ తరహా సినిమాలు ఆడేస్తుంటాయి. ఏప్రిల్ 19న థియేటర్లలో విడుదలైన 'పారిజాత పర్వం' ఈ తరహా చిత్రమే! బాక్సాఫీస్ దగ్గర మిక్స్‌డ్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం త్వరలోనే ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. కథలోకి వెళ్తే.. హీరో కావాలన్న లక్ష్యంతో శ్రీను (సునీల్) భీమవరం నుంచి హైదరాబాద్‌కు వస్తాడు. సినిమా అవకాశాల కోసం ప్రయత్నిస్తుంటాడు. సినిమా వాళ్లు వస్తారనే ఉద్దేశంతో కృష్ణానగర్‌లోని ఓ బార్‌లో వెయిటర్‌గా చేరుతాడు. అక్కడే పార్వతి (శ్రద్ధా దాస్) క్లబ్ డ్యాన్సర్‌గా పనిచేస్తుంటుంది. ఒకరోజు బార్ యజమాని పార్వతితో అనుచితంగా ప్రయత్నిస్తుంటాడు. ఆమెను రక్షించే క్రమంలో శ్రీను చేతిలో ఓనర్ చనిపోతాడు. మరోవైపు చైతన్య (చైతన్య రావు) ఎలాగైన దర్శకుడు కావాలనే పట్టుదలతో ఉంటాడు. శ్రీను కథతో సినిమా తీయాలని భావిస్తాడు. పలువురు నిర్మాతలు చైతన్యతో సినిమా తీయడానికి అంగీకరిస్తారు. అయితే చైతన్య తన స్నేహితుడు హర్ష (వైవా హర్ష) హీరోగా చేస్తాడని చెప్పడంతో ఓకే అన్న నిర్మాతలూ వెనక్కి వెళ్తారు. ఇలా లాభం లేదనుకొని సినిమా నిర్మాణం కూడా తనే చేపట్టాలని భావిస్తాడు చైతన్య. ఇందుకోసం సినీ నిర్మాత శెట్టి (శ్రీకాంత్ అయ్యంగార్) భార్య సురేఖ (సురేఖవాణి)ని కిడ్నాప్ చేయాలని ఫిక్సవుతాడు. ఆ కిడ్నాప్ ఎటు దారి తీసింది? అతనికి ఎదురైన సవాళ్లేంటి? చైతన్య సినిమా తీశాడా? శ్రీను హీరో అయ్యాడా? లేదా? అన్నది అసలు కథ.

## ఆ రోజులు గుర్తొచ్చాయి..

**రౌడీ** బాయ్ విజయ్ దేవరకొండ సరసన 'లైగర్'తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది యంగ్ బ్యూటీ అనన్యా పాండే. ప్రస్తుతం బాలీవుడ్‌లో బాగానే రాణిస్తున్నది. తాజాగా తన టీనేజ్ రోజుల్ని గుర్తుచేసుకున్నది అనన్య. హఠాత్తుగా ఆమెకు టీనేజ్ జ్ఞాపకాలు గుర్తుకురావడానికీ ఓ కారణం ఉంది. అదే.. 'ఇన్‌సైడ్ అవుట్ 2' అనే అమెరికన్ యానిమేటెడ్ చిత్రం. కెల్సీమన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా కోసం అమీ ప్లోహర్, ఫిలిస్ స్మిత్, లూయిస్ బ్లాక్, టోనీ హేల్ వంటి హాలీవుడ్ నటీనటులు వాయిస్ ఓవర్ ఇచ్చారు. హిందీ వెర్షన్‌లో 'రిలే అండర్సన్' అనే ఓ 13 ఏళ్ల అమ్మాయి పాత్రకు అనన్యా పాండే డబ్బింగ్ చెప్పింది. ఈ సందర్భంగానే.. తన టీనేజ్ ముచ్చట్లను పంచుకున్నది అనన్య. 'పిక్సర్ అండ్ డిస్నీ స్టూడియోల యానిమేషన్ చిత్రాలకు నేను వీరాభిమానిని. ఈ సంస్థల నుంచి వస్తున్న 'ఇన్‌సైడ్ అవుట్ 2'కి పనిచేయడం నిజంగా హ్యాపీగా ఉంది. రిలే పాత్రకు వాయిస్ ఓవర్ చెబుతున్నప్పుడు.. నాకు నా టీనేజ్ గుర్తొచ్చింది' అంటూ చెప్పుకొచ్చింది లైగర్ బ్యూటీ.





కథ బాగుంటే సినిమా హిట్టు. కథనం బాగుంటే రిపీట్ ఆడియెన్స్ వస్తారు. కామెడీ ట్రాక్ నవ్వులు పూయిస్తే.. పిల్లాజెల్లా కూడా చూస్తారు. ఓటీటీ రాజ్యమేలుతున్న ఈ రోజుల్లో ప్రేక్షకులను థియేటర్లకు రప్పించాలంటే ఇంతకుమించి ఏదో ఉండాలి! అందుకే టేకింగ్ విషయంలో రాజీ అనే మాటకు చోటివ్వడం లేదు దర్శక నిర్మాతలు. అయినా ప్రేక్షక దేవుళ్ల కరుణా దృష్టి కాసుల వృష్టిగా కురవడం లేదు. వాళ్లను థియేటర్ల ముందు క్యూ కట్టేలా చేయాలంటే ఇంకేదో చేయాలని ఫిక్సయ్యారు. మల్టీస్టార్ తంత్రాన్ని ప్రయోగిస్తున్నారు! ఘనమైన తారాగణం ఉంటే.. వారివారి అభిమానులు కదలివచ్చినా మినిమమ్ గ్యారెంటీ అని ఫిక్సవుతున్నారు సినీజనం. అందుకే, ఓ మోస్తరు చిత్రాల నుంచి భారీ బడ్జెట్ సినిమాల వరకు మల్టీస్టార్స్‌కు పెద్దపీట వేస్తున్నారు.

# ఘనం.. తారాగణం

**కథ** డిమాండ్ చేసిందనే అనుకోండి, బడ్జెట్ లెక్కలు సరిచూసుకోవడానికే భావించండి.. ఇప్పుడు మల్టీస్టార్ మూవీ ఒక ట్రెండ్. గతంలో తెలుగునాట స్టార్‌హీరోలు జట్టు కట్టిన చిత్రాలు చాలానే వచ్చాయి. అయితే కాలక్రమంలో అవి తెరమరుగయ్యాయి. మళ్లీ 2000 సంవత్సరం తర్వాత అడపాదడపా బిగ్ హీరోల కాంబో సినిమాలు ప్రేక్షకులను పలకరించాయి. ఇటీవలి కాలంలో భారీ బడ్జెట్ సినిమాలన్నిటిలో ఇద్దరు పెద్ద హీరోలు ఉండటం రివాజుగా మారింది. పాత్రలు ఏవైనా ఇద్దరు పెద్ద నటులు తెర పంచుకుంటూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నారు.

**నాగ్ అశ్విన్** దర్శకత్వంలో విడుదలకు సిద్ధమవుతున్న 'కల్కి 2898 ఏడీ'లో ఘనమైన తారాగణం కనువిందు చేయనుంది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌కు జతగా బాలీవుడ్ క్వీన్ దీపికా పదుకొణె నటిస్తున్నది. ఇందులో ప్రతినాయకుడిగా కమల్‌హాసన్ కనిపిస్తుండటం విశేషం. మరో కీలకమైన పాత్రలో అమితాబ్ బచ్చన్ అలరించనున్నాడు. అశ్వత్థామగా బిగ్ బి నటిస్తున్నాడని విడుదల చేసిన స్టిల్ నెట్టింట వైరల్ అవుతున్నది. మరో ముఖ్యమైన పాత్రను రాజేంద్రప్రసాద్ పోషిస్తున్నాడట. ఇలా మొత్తంగా ఆరువేల సంవత్సరాల కాలక్రమంలో జరిగే కథగా తుది మెరుగులు దిద్దుకుంటున్న 'కల్కి..' తెరపై ఎన్ని మెరుపులు పంచుతుందో ఈ నెల 27న తేలనుంది.

**తెలుగు** తెరపై చిరకాలం గుర్తుండిపోయే సినిమాల్లో 'శ్రీకాళహస్తి మహాత్మ్యం' ఒకటి. కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్ నటించిన ఈ సినిమా బాపు దర్శకత్వంలో 'భక్త కన్నప్ప'గా అలరించింది. ఇందులో కృష్ణంరాజు హీరో. మళ్లీ అదే కథతో మంచు విష్ణు కథానాయకుడిగా 'భక్త కన్నప్ప' తెరకెక్కుతున్నది. అయితే ఇందులో ప్రభాస్ శివుడి పాత్రలో కనిపించనున్నట్టు ఇండస్ట్రీ టాక్. మంచు విష్ణు నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమా ఎలాగైనా భారీ విజయం సాధించాలని భారీ తారాగణాన్ని ఎంచుకుంటున్నాడు. మోహన్‌బాబు, మలయాళ నటుడు మోహన్‌లాల్, కన్నడ హీరో శివ రాజ్‌కుమార్, తమిళ నటుడు శరత్ కుమార్, బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్ కూడా 'భక్త కన్నప్ప'లో భాగమవుతున్నారు. ఆయా నటుల పాత్రలు, నిడివిపై ఇప్పటికింకా స్పష్టత రాకున్నా.. పాన్ ఇండియా చిత్రంగా రూపుదిద్దుకుంటున్న సినిమాలో ఆల్ ఇండియా స్టార్స్ నటిస్తుండటం విశేషం.

**మల్టీస్టార్** సినిమాలకు తమిళ దర్శకులు పెద్దపీట వేస్తుంటారు. 'దళపతి', 'యువ', 'రావణ్', 'నవాబ్', 'పొన్నియిన్ సెల్వన్' ఈ కోవకే చెందుతాయి. వీటిలో సింహభాగం విజయం సాధించినవే. తాజాగా కమల్ హీరోగా మణిరత్నం తెరకెక్కిస్తున్న 'థగ్స్ లైఫ్'లో మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ కూడా నటిస్తున్నాడట. ఇక శంకర్ దర్శకత్వంలో షూటింగ్ పూర్తి చేసుకుంటున్న 'భారతీయుడు 2'లో కమల్‌తోపాటు సిద్ధార్థ్ కూడా నటిస్తున్నాడు. రజనీకాంత్ హీరోగా టీజే జ్ఞానవేల్ తెరకెక్కిస్తున్న చిత్రంలో అమితాబ్, ఫహాద్ ఫాజిల్, రానా కూడా ఉన్నారని కోలీవుడ్ టాక్.

**టాలీవుడ్** విషయానికి వస్తే 1990 తర్వాత రెండు దశాబ్దాలపాటు స్టార్‌డమ్ ఉన్న హీరోలు మల్టీస్టారర్ చేసిన దాఖలాలు దాదాపు లేవనే చెప్పాలి. చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్ ఇండస్ట్రీని దున్నేస్తున్నా.. వీరిలో ఏ ఇద్దరూ జట్టు కట్టలేదు! తర్వాతి కాలంలో తెలుగు దర్శకులు సైతం మల్టీస్టార్ మూవీస్‌కు జై కొట్టడం మొదలైంది. రాజమౌళి 'బాహుబలి'తో ఆ ట్రెండ్ మరింత ఊపందుకుంది. 'ఆర్‌ఆర్‌ఆర్'లో ఏకంగా ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లను ఒకే స్క్రీన్ పైకి తెచ్చి బాక్సాఫీస్ రికార్డులు తిరగరాశాడు జక్కన్న. నాగార్జున, నాని కాంబోలో 'దేవదాసు' ఫలితం ఎలా ఉన్నా మల్టీస్టార్ మూవీగా పేరు దక్కించుకుంది. 'ఎఫ్ 2', 'ఎఫ్ 3' చిత్రాలతో వెంకటేశ్, వరుణ్ తేజ్ హిట్ కాంబోగా నిలిచారు. చిరంజీవి రీ ఎంట్రీలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన 'సైరా నరసింహారెడ్డి' భారీ తారాగణానికి వేదికైంది. ఇందులో అమితాబ్ బచ్చన్, విజయ్ సేతుపతి, కిచ్చ సుదీప్ పాత్రోచితంగా నటించి మెప్పించారు. మొత్తంగా టాలీవుడ్ కొత్తగా అందుకున్న 'మల్టీస్టార్' రాగం ఇంకెంత కాలం కొనసాగుతుందో చూడాలి!

### రెండు కండ్లు..

**మల్టీస్టార్** మూవీస్ అంటే ఒకప్పుడు బాలీవుడ్ హక్కుగా ఉండేది. తెలుగులోనూ అగ్ర కథానాయకులు జతకట్టిన సినిమాలు ఉన్నాయి. ఎన్టీఆర్, ఏయన్నార్ జట్టుగా వచ్చిన సినిమాలు కొన్ని సంచలన విజయాలు సాధించాయి. వీరిద్దరూ మొదటిసారి కలిసి నటించిన సినిమా 'పల్లెటూరి పిల్ల'. అప్పటికి ఏయన్నార్ స్టారే అయినా.. ఎన్టీఆర్ ఇండస్ట్రీకి కొత్తే! తర్వాతి కాలంలో ఈ జోడీ వెండితెరపై కనిపించిన ప్రతిసారీ కలెక్షన్ల వర్షం కురిసింది. 'మిస్సమ్మ', 'మాయాబజార్', 'గుండమ్మకథ' లాంటి టాలీవుడ్ ఎవర్‌గ్రీన్ చిత్రాల్లో వీరిద్దరూ సమ ఉజ్జీలుగా కనిపిస్తారు. 'తెనాలి రామకృష్ణ' సినిమాలో టైటిల్ రోల్ ఏయన్నార్ పోషిస్తే, కృష్ణదేవరాయలుగా ఎన్టీఆర్ నటించారు. 'భూ కైలాస్'లో రావణబ్రహ్మగా ఎన్టీఆర్ లీడ్ రోల్ పోషిస్తే.. ఏయన్నార్ నారదుడిగా మెప్పించాడు. ఇలా వీరిద్దరి కాంబో నిర్మాతలకు దండిగా కలెక్షన్లు తెచ్చిపెట్టింది. 'శ్రీకృష్ణార్జున యుద్ధం' ఎవర్‌గ్రీన్ జాబితాలో చోటు దక్కించుకుంది.

### రెండోతరం కృష్ణార్జునులు

**ఎన్టీఆర్,** ఏయన్నార్ తర్వాత కృష్ణ, శోభన్‌బాబు ఆ స్థాయి హీరోలు అనిపించుకున్నారు. ఒకే తరానికి చెందిన ఈ హీరోలిద్దరూ ఎన్నో సినిమాల్లో జట్టుకట్టారు. పదిహేనుకు పైగా సినిమాల్లో వీళ్లు కలిసి నటించారు. 'లక్ష్మీనివాసం' సమయానికి ఇద్దరూ అప్‌కమింగ్ ఆర్టిస్టులే! 'శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న'లో అతిథిపాత్రలో జోడుగా కనిపించారు. 'మంచిమిత్రులు' సినిమాతో కృష్ణ, శోభన్‌బాబు జట్టుకడితే సినిమాకు తిరుగు ఉండదని నిర్మాతలకు భరోసా వచ్చింది. ఎన్టీఆర్ లీడ్ రోల్‌లో వచ్చిన 'విచిత్ర కుటుంబం'లో మరోసారి ఇద్దరూ కలిశారు. ఈ కాంబినేషన్‌లో సూపర్‌హిట్‌గా నిలిచిన మొదటి సినిమా 'గంగ-మంగ'. వాణిశ్రీ ద్విపాత్రాభినయం చేసిన ఈ చిత్రంలో కృష్ణ, శోభన్‌బాబు మాస్, క్లాస్ పాత్రలతో అలరించారు. సురేష్ ప్రొడక్షన్స్‌పై రాఘవేంద్రరావు దర్శకత్వంలో వచ్చిన 'ముందడుగు' వీరిద్దరి నటనా వైచిత్రిని చాటి చెప్పింది. సంపన్నుడిగా శోభన్‌బాబు, కార్మికుడిగా కృష్ణ అదరగొట్టారు. 'కురుక్షేత్రం' సినిమాలో కృష్ణుడిగా శోభన్‌బాబు, అర్జునుడిగా కృష్ణ అలరించారు. 'మండే గుండెలు', 'మహాసంగ్రామం', 'పుట్టినిల్లు మెట్టినిల్లు' వీరిద్దరూ కలిసి నటించిన వాటిల్లో గుర్తుంచుకోదగ్గ సినిమాలు.



## అదే నా సీక్రెట్..

**వెండితెరపై** రాణించాలంటే హీరోయిన్లకు అందంతోపాటు చక్కని ఆహార్యం కూడా ఉండాల్సిందే! అందుకోసం జీరో సైజ్ మెయింటైన్ చేయాల్సిందే! రకరకాల డైట్‌లు ఫాలో కావాల్సిందే! అయితే.. ఒక్కొక్కరూ ఒక్కో రకమైన డైట్ పాటిస్తారు. వ్యాయామాలు కూడా భిన్నంగా ఎంచుకుంటారు. సినిమాల్లో పాత్రలకు తగినట్లు.. ఒక్కోసారి బరువు పెరగాలి. తగ్గాలి. ఇది నటీమణులకు పెద్ద సవాలే! బరువు పెరగడం తేలికైనా.. తగ్గడం మాత్రం చాలాకష్టం. తాజాగా బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ.. తన డైట్ సీక్రెట్‌ను రివీల్ చేసింది. తను ఎంత త్వరగా బరువు పెరగగలనో.. అంతే త్వరగా తగ్గగలనని చెప్పుకొచ్చింది. తనకు బరువు పెరగడం, తగ్గడం రెండూ సులభమేనని అంటున్నది కియారా. 'నాకు డ్యాన్స్, స్విమ్మింగ్ అంటే ఇష్టం. స్కూల్ డేస్‌లో ఎప్పుడో ఓసారి డ్యాన్స్, స్విమ్మింగ్ చేసేదాన్ని. కానీ, సినిమాల్లోకి వచ్చాక.. ఈ రెండిటినీ నా దినచర్యలో భాగంగా చేసుకున్నా. డ్యాన్స్, స్విమ్మింగ్‌తోపాటు వ్యాయామం కూడా నా ఫిట్‌నెస్‌లో భాగమే. ఏది చేసినా ఇష్టంగా చేస్తే సరదాగా ఉండటంతోపాటు మంచి ఫలితం కూడా ఉంటుంది. ఎంత నచ్చిన ఆహారమైనా అతిగా తినడం లేదా పూర్తిగా ఉపవాసం ఉండటం నాకు అలవాటు లేదు. మసాలాలు తక్కువగా ఉండే ఇంటి భోజనానికే నా ఓటు' అంటూ తన ఫిట్‌నెస్ సీక్రెట్‌ను పంచుకున్నదీ లేడీ గేమ్ చేంజర్!



## అభిమాని భయపడిపోయా!

**సినిమా** వాళ్లకేకాదు.. బుల్లితెర నటీనటులకూ వీరాభిమానులు ఉంటారు. అగ్రతారలకు ఏమాత్రం తగ్గకుండా ఆరాధిస్తుంటారు. అయితే, కొందరి అతి అభిమానం.. నటీనటులనే భయపడేలా చేస్తుంది. అలాంటి ఓ సంఘటన తనకు ఎదురైందని చెబుతున్నది హిందీ బుల్లితెర నటి హీనా ఖాన్. అమెజాన్ మినీ టీవీలో ప్రసారమవుతున్న 'నామాకూల్' అనే వెబ్ సిరీస్‌లో నటిస్తున్నది. ఈ వెబ్‌సిరీస్ ద్వారానే చాలామంది అభిమానుల్ని సంపాదించుకున్నది. 'యే రిష్తా క్యా కెహ్లాతా హై' సీరియల్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్న హీనా.. కసౌటి జిందగీ కే, నాగిన్ (5వ సీజన్) సీరియల్స్‌లో ముఖ్య పాత్రలు పోషించింది. హిందీ బిగ్‌బాస్‌లోనూ అలరించింది. కాగా, తాజాగా ఓ ఇంటర్వ్యూలో తనకు ఎదురైన ఓ ఇబ్బందికర ఘటనను పంచుకున్నది హీనా.
'ఒకసారి షూటింగ్ కోసం ఉత్తరాఖండ్ వెళ్లాను. అది జనాలు ఎక్కువగా ఉండే ప్రదేశం. అక్కడ షూటింగ్ జరిగినన్ని రోజులూ ఒక అమ్మాయి రోజూ అక్కడికి వచ్చి.. నన్ను కన్నార్పకుండా చూసేది. నేను తనను గమనించి ఒకసారి పిలిచి కాసేపు మాట్లాడాను. అయినప్పటికీ తను రోజూ వచ్చి అలాగే చూస్తూ ఉండేది. దాంతో నాకు ఇబ్బందిగా అనిపించింది. అదే విషయం నా టీమ్‌తో చెప్పించాను. నేను ఇబ్బందిపడుతున్నానని అర్థమవడంతో ఆమె వెంటనే వెళ్లిపోయింది. కానీ మర్నాడే సెట్‌కు వచ్చింది. ఆరోజు నేను బాధాకరమైన సీన్‌లో నటించాలి. దాంతో ఏడుస్తూ కూర్చున్నాను. కాసేపటికి టిష్యూతో కళ్లు తుడుచుకుని.. దాన్ని చెత్తబుట్టలో పడేశాను. వెంటనే ఆ అమ్మాయి డస్ట్‌బిన్ అంతా వెతకడం మొదలుపెట్టింది. ఆమె ఏం చేస్తున్నదో మొదట నాకు అర్థం కాలేదు. చెత్తనంతా వెతికి.. నేను వాడి పడేసిన టిష్యూను తీసుకుని జాగ్రత్తగా తన దగ్గర పెట్టుకున్నది. ఆమె అలా చేయడం చూసి షాకయ్యాను. చాలా భయపడ్డాను కూడా! అభిమానం ఉండొచ్చు.. కానీ దానికి కూడా హద్దులుండాలి' అంటూ తనను భయపెట్టిన అభిమాని గురించి భయటపెట్టింది హీనా ఖాన్.

